సాక్షి
విజయనగరం
సోమవారం, 3, జూన్‌, 2024



క్రీడాకారుల అడ్డా సిరిపురం...
మండలంలోని సిరిపురం క్రీడాకారుల అడ్డాగా నిలుస్తోంది. గ్రామంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ప్రతి సంవత్సరం వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. - 8లో



సీఓపీడీ ప్రాణాంతకం.. - 8లో
ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే క్షయ, కుష్టు, హెచ్‌ఐవీ వ్యాధులను అదుపు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొచ్చి ప్రాణాంతకంగా మారుతున్నాయి.



శ్రీరామ చక్రధర్‌కు సత్కారం
రామాయణంపై 10 ఏళ్లుగా పరిశోధనలు చేస్తున్న తవాస్మి, మనస్వి, తపస్వి పుస్తక రచయిత శ్రీరామ చక్రధర్‌ను ఎన్‌సీఎస్‌ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్‌ ఆదివారం ఘనంగా సత్కరించారు. - 8లో

న్యూస్‌రీల్‌

ఊరటనిచ్చిన వర్షం

రాజాం సిటీ: ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఆదివారం సాయత్రం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సుమారు గంటసేపు పడింది. రాజాం పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసవి దుక్కులతోపాటు నారుమడులను సిద్ధం చేసేందుకు ఈ వర్షం ఎంతో ఉపకరిస్తుందని చెబుతున్నారు.

ర్యాండమైజేషన్‌లో కౌంటింగ్‌ సిబ్బంది కేటాయింపు



రాండమైజేషన్‌ చేస్తున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు

విజయనగరం అర్బన్‌: ఈ నెల 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బందిని 2వ రాండమైజేషన్‌ ద్వారా కలెక్టర్‌ నాగలక్ష్మి ఆదివారం ఆయా నియోజకవర్గాలకు కేటా యించారు. ఇందుకుగాను 306 మంది కౌంటింగ్‌ సూపర్‌వైజర్లు, 376 మంది కౌంటింగ్‌ అసిస్టెంట్లు, 325 మంది మైక్రో అబ్జర్వర్లను కలిపి మొత్తం 1,007 మందిని రాండమైజేషన్‌ ద్వారా కేటాయించారు. కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు హాని ష్‌ చాబ్రా, సీతారాం జాట్‌, స్నేహల్‌ ప్రతాప్‌ భోస్లే, దేబజిత్‌ ఖనికర్‌, జేసీ కార్తీక్‌, డీఆర్‌ఓ అనిత, డీఐఓ నరేంద్ర, ఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.


సైనికులకు సన్మానం



సన్మానం పొందిన సైనికులు

జామి: దేశ రక్షణ విధులు నిర్వహించి స్వగ్రామానికి చేరుకున్న సైనికులను అన్నంరాజుపేట గ్రామంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం తరపున ఆదివారం ఘనంగా సన్మానించారు. గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దేశ రక్షణకు అందించిన సేవలను గ్రామపెద్దలు కొనియాడారు. సైనికులైన మహంతి చిన్నం నాయుడు, కాకర్లపూడి సూరిబాబురాజు, రొక్కం రవి, బుద్ధరాజు రమేష్‌, మరుముల్ల లోకేష్‌, చెల్లూరు సంతోష్‌, జంపన సతీష్‌, పోతల గణపతిలను ఘనంగా సన్మానించారు. అనంతరం వారి గురువు శంకరరావు మాస్టారును సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ చెల్లూరు సూరిబాబు, గ్రామపెద్దలు పి.కనక రాజు, ముకుంద శ్రీనివాసరావు, ఆర్‌. పోతన్న, మెరువ నానాజీ, ఎం.బంగారుకృష్ణ, ఎ.శంకర్‌, కె.ఎర్రిబాబు పాల్గొన్నారు.

వంటగ్యాస్‌ లీకై సామగ్రి దగ్ధం



ఇంట్లో దగ్ధమైన సామగ్రి

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ మామిడిమానుగూడ గ్రామానికి చెందిన బిడ్డిక సీమయ్య ఇంట్లో ఆదివారం వంటగ్యాస్‌ సిలిండర్‌ లీకవడంతో మంటలు చెలరేగి పూర్తిగా సామగ్రి దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో అదృష్టవశాత్తు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1 లక్ష వరకు ఆస్తినష్టం సంభవించినట్లు బాధితుడు బిడ్డిక సీమయ్య వాపోయాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

రేపే కౌంటింగ్‌



జేఎన్‌టీయూ జీవీ వర్సిటీ కౌంటింగ్‌ కేంద్రంలో ఏర్పాట్లు

- సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సన్నద్ధం
- ఉదయం 8 గంటలకు ప్రారంభం
- రెండు కేంద్రాల్లో పూర్తయిన ఏర్పాట్లు

విజయనగరం అర్బన్‌:

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సమయం దగ్గరపడింది. మంగళవారం ప్రజాతీర్పు వెల్లడి కానుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు జిల్లా అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీలో బొబ్బిలి, విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటుకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరుగుతుంది. విజయనగరం పార్లమెంటుకు సంబంధించి, మిగిలిన నియోజకవర్గాల అసెంబ్లీ, పార్లమెంట్‌ ఓట్ల లెక్కింపు లెండి ఇంజినీరింగ్‌ కళాశాలలో జరుగుతుంది. ముందుగా పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా పోలైన ఓట్లను కట్టగా కట్టి..పార్లమెంట్‌, అసెంబ్లీ స్థానాల ఆధారంగా వేరు చేస్తారు. ఇలా కట్టకట్టిన పోస్టల్‌ బ్యాలెట్లను లెక్కించడం పూర్తయ్యాక ఫలితాలను వెల్లడిస్తారు. ఆపై ఈవీఎంలలో పోలైన ఓట్లను లెక్కించి సంపూర్ణ ఫలితాలు ప్రకటిస్తారు.

ఉదయం 8 గంటలకు ప్రారంభం

జూన్‌ 4వ తేదీన ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. కౌంటింగ్‌ సిబ్బంది ఉదయం 6 గంటలకు, ఏజెంట్లు ఉదయం 7 గంటలకల్లా వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. మొదట పోస్టల్‌ బ్యాలెట్‌ లెక్కింపు జరుగుతుంది. అరగంట తర్వాత ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుంది. అన్ని చోట్లా అసెంబ్లీ, పార్లమెంట్‌ ఓట్ల కౌంటింగ్‌కు వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయనగరం పార్లమెంట్‌ స్థానం పరిధిలోని ఏడు నియోజకవార్గాల్లో (ఎచ్చెర్లతో సహా) పార్లమెంటుకు పోలైన పోస్టల్‌ బ్యాలెట్లన్నీ లెండి ఇంజినీరింగ్‌ కళాశాలలోనే లెక్కించనున్నారు. విశాఖ పార్లమెంట్‌ స్థానం పరిధిలో ఉన్న ఎస్‌.కోట నియోజకవర్గంలో ఎంపీకి పోలైన పోస్టల్‌ బ్యాలెట్‌లను విశాఖ పట్నంలో లెక్కిస్తారు.

కౌంటింగ్‌లో కఠిన నిబంధనలు



ఓట్ల లెక్కింపు భద్రతా ఏర్పాట్లపై ఎన్నిక కమిషన్‌ ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈసీ అనుమతి ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్‌ కేంద్రంలోకి అనుమతిస్తారు.

- ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్‌ రూమ్‌ భవనాల ప్రవేశ ద్వారం నుంచి కౌంటింగ్‌ హాళ్ల వరకూ ఉన ప్రదేశాన్ని రెండో అంచెగా పరిగణిస్తారు. ఇక్కడ తగినంత మంది రాష్ట్ర సాయుధ పోలీసులు ఉంటారు.
- ఆడియో, వీడియో రికార్డు చేయగల మొబైల్‌ ఫోన్లు, ఐ ప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్‌ పరికరాలను లోపలకు అనుమతించరు. అలాగే అగ్గిపెట్టె, ఇంకు పెన్నులు, బ్లేడ్‌లు, చాకులు, పిన్నులు, ఆయుధాలను అనుమతించరు. పెన్సిల్‌, తెల్లకాగితాలు తీసుకుని వెళ్లవచ్చు.
- కౌంటింగ్‌ హాల్‌ బయట నిలబడి ఎవరూ ఫోన్లలో మాట్లాడకూడదు. మీడియా లేదా పబ్లిక్‌ కమ్యూనికేషన్‌ రూంలో మాత్రమే ఫోన్లు మాట్లాడుకోవచ్చు. ఫోన్లు డిపాజిట్‌ చేసే సౌకర్యం ఉంటుంది.
- కౌంటింగ్‌ కేంద్రం ద్వారం నుంచి మూడో అంచె భద్రత ప్రారంభమవుతుంది. ఇక్కడ సీఆర్‌పీఎఫ్‌ సిబ్బంది ఉంటారు. రిటర్నింగ్‌ అధికారి పిలిస్తే తప్ప వీరు కౌంటింగ్‌ హాల్‌లోకి ప్రవేశించరాదు.
- ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్‌ వద్ద మాత్రమే కూర్చోవాలి. కౌంటింగ్‌ హాల్‌ అంతా తిరిగేందుకు అనుమతి లేదు.

పోలైన ఓట్ల వివరాలు		
నియోజకవర్గం	ఈవీఎం ఓట్లు	పోస్టల్‌ ఓట్లు
రాజాం(ఎస్సీ)	1,72,906	3,046
బొబ్బిలి	1,85,775	2,923
చీపురుపల్లి	1,71,533	1,855
గజపతినగరం	1,77,612	2,439
నెల్లిమర్ల	1,88,456	2,121
విజయనగరం	1,84,787	4,944
ఎస్‌.కోట	1,90,104	2,642
మొత్తం	12,71,173	19,970

అసెంబ్లీకి పోలైన పోస్టల్‌బ్యాలెట్‌, ఈవీఎం ఓట్లను జిల్లాలోని ఆయా నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో లెక్కిస్తారు.

ముందుగా నెల్లిమర్ల ఫలితాలు

పార్లమెంట్‌, అసెంబ్లీ కౌంటింగ్‌కు ఒక్కో కేంద్రంలో 14 టేబుళ్ల చెప్పున ఏర్పాటు చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్‌ నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరుగా రాజాం అత్యధికంగా 21 రౌండ్లు, నెల్లిమర్ల అత్యల్పంగా 18 రౌండ్లు ఏర్పాటు చేశారు.ఎస్‌కోట 20, బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, విజయనగరం నియోజకవర్గాలకు 19 చొప్పున రౌండ్లను ఏర్పాటు చేశారు. అత్యల్పంగా 18 రౌండ్‌లున్న నెల్లిమర్ల ఫలితాలు ముందుగా వెలువడే అవకాశం ఉంది. టేబుళ్ల వద్ద లెక్కింపు పూర్తయి, ఆ రౌండ్‌ ఫలితాలను ప్రకటించిన తరువాతే తదుపరి రౌండ్‌ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్‌ నాగలక్ష్మి

- వీసీలో సీఈఓకు కలెక్టర్‌ వివరణ

విజయనగరం అర్బన్‌:

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్‌ ఎస్‌.నాగలక్ష్మి ఎన్నికల రాష్ట్ర ప్రధాన అధికారికి తెలిపారు. రెండు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడుతున్నామని లెక్కింపు ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్‌ రోజు సిబ్బంది, ఏజెంట్లు నిర్దేశిత సమయంలో కౌంటింగ్‌ కేంద్రానికి చేరుకునేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌లు, ఎన్నికల అధికారులతో రాష్ట్ర ఎన్నికల సీఈఓ ముఖేష్‌ కుమార్‌ మీనా ఆదివారం వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కౌంటింగ్‌ కేంద్రాల్లో మీడియాకు, కమ్యూనికేషన్‌ రూమ్‌ల ఏర్పాటుపై సీఈఓ తెలుసుకున్నారు. పోస్టల్‌ బ్యాలెట్‌ ఫెసిలిటేషన్‌ కేంద్రాల్లో వేసిన పోస్టల్‌ బ్యాలెట్లకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలు పాటించి వాటికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్‌ కలెక్టర్‌ కె.కార్తీక్‌, డీఆర్‌ఓ ఎస్డీ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు సంతృప్తికరం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని ఎన్నికల సంఘం తరపున ఓట్ల లెక్కింపు పరిశీలకులుగా నియమితులైన డాక్టర్‌ దేబజిత్‌ ఖనికర్‌ అన్నారు. లెండి ఇంజినీరింగ్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం చేసిన కౌంటింగ్‌ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల తరపున కౌంటింగ్‌ ఏజెంట్లు నిర్దేశిత సమయానికి వచ్చేలా చర్యలు చేపట్టాలని తద్వారా కౌంటింగ్‌ సకాలంలో ప్రారంభించేందుకు వీలవుతుందన్నారు. ఈ విషయమై అభ్యర్థులకు ముందుగా సమాచారం అందించి వారు సకాలంలో కౌంటింగ్‌ కేంద్రాలకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని రిటర్నింగ్‌ అధికారి నూకరాజుకు సూచించారు. అనంతరం కౌంటింగ్‌ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమాచారం కేంద్రాన్ని సందర్శించారు. అలాగే కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకుడు హనీష్‌ దాబ్రా కూడా లెండి కళాశాలలో ఏర్పాట్లను విజయనగరం పార్లమెంట్‌ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్‌ బ్యాలెట్‌ లెక్కింపు హాల్‌ను కలెక్టర్‌ నాగలక్ష్మితో కలిసి పరిశీలించారు.



కౌంటింగ్‌ హాల్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు డాక్టర్‌ దేబజిత్‌ ఖనికర్‌

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు హనీష్‌ చాబ్రా, సీతారాం జాట్‌

- అబ్జర్వర్లు హనీష్‌ చాబ్రా, సీతారాం జాట్‌

విజయనగరం అర్బన్‌: సార్వత్రిక ఎన్నికల ఓట్లను లెక్కించే సమయంలో సూక్ష్మ పరిశీలకులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్నికల పరిశీలకులు హనీష్‌ చాబ్రా, సీతారాం జాట్‌ సూచించారు. ఓట్ల కౌంటింగ్‌ అత్యంత సున్నితమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. కౌంటింగ్‌లో పాల్గొనే మైక్రో అబ్జర్వర్లకు కలెక్టరేట్‌ ఆడిటోరియంలో ఆదివారం రెండో విడత శిక్షణ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మితోపాటు, జిల్లా ఎన్నికల పరిశీలకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, సూక్ష్మ పరిశీలకులకు దిశానిర్దేశం చేశారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిశీలకుడు హనీష్‌ చాబ్రా మాట్లాడుతూ కౌంటింగ్‌లో సూక్ష్మ పరిశీలకుల పాత్రను వివరించారు. ప్రతి ఒక్కరూ ఉదయం 6 గంటలకే తమకు కేటాయించిన కేంద్రాల్లోని టేబుల్‌ వద్దకు చేరుకోవాలని సూచించారు. వారంతా రౌండ్‌ వారీగా నింపాల్సిన పట్టికలను కచ్చితమైన వివరాలతో పూర్తి చేసి ఏజెంట్లతో సంతకాలు తీసుకోవాలని చెప్పారు. వాటిని అబ్జర్వర్లు, లేదా ఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎస్‌.కోట నియోజకవర్గ పరిశీలకుడు సీతారాం జాట్‌ మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకులకు ప్రతి రౌండ్‌ కీలకమని, కచ్చితమైన వివరాలను నమోదు చేయాలని ఎక్కడా పొరపాట్లు దొర్లకూడదని సూచించారు. అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను ఏజెంట్లకు చూపించాలని వారి నుంచి సంతకాలు తీసుకోవాలని చెప్పారు. ఈవీఎంలను తీసుకువచ్చేటప్పుడు ఓట్లను లెక్కించేటప్పుడు మిషన్లు పాడవకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు.

మైక్రో అబ్జర్వర్లదే బాధ్యత

కలెక్టర్‌ నాగలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల రోజు కంటే లెక్కింపు రోజు మైక్రో అబ్జర్వర్లు ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. ఆ రోజు వారంతా ప్రత్యక్షంగా ఉండి, పలు ఫలితాల పట్టికలను నింపాల్సి ఉంటుందని చెప్పారు. పోస్టల్‌ బ్యాలెట్‌ విషయంలో ఎన్నికల కమిషన్‌ తాజాగా జారీ చేసిన ఆదేశాలను వివరించారు. కౌంటింగ్‌ ప్రక్రియ ఎన్నికల కమిషన్‌ నిబంధనల మేరకు జరిగేవిధంగా చూడాల్సిన బాధ్యత మైక్రో అబ్జర్వర్లపై ఉందన్నారు. ఏమైనా తేడాలను గుర్తిస్తే వెంటనే పరిశీలకులు, రిటర్నింగ్‌ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు ఓట్ల వివరాలను అబ్జర్వర్లకు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. లెక్కింపు ప్రక్రియలో ప్రతి దశా కీలకమైనని కలెక్టర్‌ స్పష్టం చేశారు. ట్రైనింగ్‌ నోడల్‌ అధికారి సుధాకరరావు మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలు, కౌంటింగ్‌ ప్రక్రియను పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా వివరించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు డాక్టర్‌ డెబజిత్‌ ఖనికర్‌, గజపతినగరం పరిశీలకుడు స్నేహల్‌ ప్రతాప్‌ భోస్లే, జాయింట్‌ కలెక్టర్‌ ఎ.కార్తీక్‌, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో భారీ వర్షం



ప్రధాన రహదారిలో రాత్రి 8.30 గంటల సమయంలో ఉరుములతో పట్టపగల్లా ఉన్న వాతావరణం

- ఉరుములు, మెరుపులతో దద్దరిల్లిన ఆకాశం
- పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో పడిన పిడుగు
- సమీప 50 గృహాల్లో కాలిపోయిన ఇన్వర్టర్లు

వీరఘట్టం: గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదివారం రాత్రి సుమారు 7.30 గంటల నుంచి 8.45 గంటల వరకు భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు ఉరుములు, మెరుపులతో భారీ పిడుగులు సమీప పంట పొలాల్లో పడడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో పిడుగుపడి ఓ చెట్టు కూలిపోయింది. అంతేకాకుండా పోలీస్‌స్టేషన్‌ సమీపంలో ఉన్న సుమారు 50 గృహాల్లో ఇన్వర్టర్లు కాలిపోయాయి. పిడుగుపాటుకు ఎటువంటి ప్రాణహాని జరగనప్పటికీ ప్రజలు భయంతో వణికిపోయారు. ఏది ఏమైనప్పటికీ పగలంతా ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

బాసంగి ముంపులో ఏనుగులు



బాసంగి ముంపులో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి ముంపు ప్రాంతంలో ఏనుగులు జలకాలాడుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు ముంపులో ఉండి సాయంత్రానికి వెంకటరాజపురం, నిమ్మలపాడు గ్రామాల్లోని అరటి, పామాయిల్‌ తోటల్లోకి జారుకున్నాయి. అరటి పంటను ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇంటికి వచ్చే సమయానికి పంట నేలకొరగడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఏనుగులును తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

ఆదివాసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

విజయనగరం అర్బన్‌: ఆదివాసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ ఉద్యోగుల ఫెడరేషన్‌ ఆర్గనైజర్‌, ముంబై సెంట్రల్‌ యూనివర్సిటీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ చేతన్‌ కుమార్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు విజయనగరంలో ఉన్న ఏపీ ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ డీవీజీశంకర రావును ఫెడరేషన్‌ ఆర్గనైజర్‌ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఉద్యోగులు జాతీయస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వచ్చే నెలలో జరగబోయే సదస్సుకు అతిథిగా ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ఆదివాసీ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ జిల్లా చైర్మన్‌ రామారావు దొర మన్యం జిల్లా ఆదివాసీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాయింట్‌ యాక్షన్‌ కమిటీ సభ్యులు సోమేలి సింహాచలం, ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ ఆంధ్రప్రదేశ్‌ స్టేట్‌ ఆర్గనైజర్‌ ఆదివాసీ ఎంప్లాయిస్‌ ఫెడరేషన్‌ జిల్లా కమిటీ సభ్యులు సుబ్బారి గురదొర, చెర్రికి సింహాచలం, వంతం కామేశ్వరరావు, మాసాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందుకుంటున్న ఏపీ ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ డీవీజీశంకరరావు

విజయం ఏకపక్షం

- ఎగ్జిట్‌ పోల్స్‌తో ధీమా వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ
- ఫలితాల కోసం అభ్యర్థులు, నాయకులు, ప్రజల నిరీక్షణ

వీరఘట్టం:

మరి కొద్ది గంటల్లో నేతల తలరాతలు తేలిపోనున్నాయి. స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచిన ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం దాగిఉంది. నరాలు తెగే ఉత్కంఠతో 20 రోజులుగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలు ఈనెల 4న వెలువడనున్నాయి. పోలింగ్‌ ముగిసినప్పటి నుంచి రాష్ట్రంతో పాటు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, రాజకీయ మేధావులు ఫలితం ఎలా ఉండబోతుందోనని, ఎవరు గెలవబోతున్నారని, ప్రజలు ఏవిధంగా తీర్పు ఇవ్వబోతున్నారంటూ ఎదురుచూస్తూ ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. మంగళవారం విడుదల కానున్న ఫలితాలు అందరి లెక్కలు తేలుస్తూ ఎన్నో ప్రశ్నలకు సమాధానం ఇవ్వనున్నాయి.ఏది ఏమైనప్పటికీ ఫలితాలు మాత్రం వైఎస్సార్‌సీపీకే అనుకూలంగా ఉన్నాయంటూ శనివారం విడుదలైన ఎగ్జిట్‌ పోల్స్‌,పలు సర్వేలు చేబుతుండడంతో వార్‌ వన్‌ సైడ్‌ అంటూ జిల్లాలోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు, పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అంతటా ద్విముఖ పోటీయే..

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 7 నుంచి 8 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రతి నియోజకవర్గంలో పోటీ మాత్రం ద్విముఖంగానే ఉందని ఎన్నికల సరళి చెబుతోంది. 2019 ఎన్నికల్లో గెలుపొందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు విశ్వాసరాయి కళావతి, పీడిక రాజన్న దొర, పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావులు 2024 ఎన్నికల్లో కూడా గెలవడం ఖాయమని స్థానిక నాయకులు స్పష్టం చేస్తున్నారు.

శనివారం విడుదలైన ఎగ్జిట్‌ పోల్స్‌ కూడా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండడంతో విజయం ఏకపక్షమేనంటూ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ఫలితాలు దగ్గర పడుతున్నకొద్దీ అందరిలోనూ ఉత్కంఠ మాత్రం నెలకొంది.

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి గాలి వీస్తోంది



ఎగ్జిట్‌ పోల్స్‌ అన్నీ వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నాయి.రాష్ట్ర వ్యాప్తంగా జగన్‌మోహన్‌రెడ్డి గాలి వీస్తోందని ఈ ఎగ్జిట్‌ పోల్స్‌ చెబుతున్నాయి.వైఎస్సార్‌సీపీ ప్రకటించిన మేనిఫెస్టోను జగన్‌మోహన్‌రెడ్డి కచ్చితంగా అమలు చేస్తారనే నమ్మకం ప్రజల్లో ఉంది. అందుకే గెలుపు ధీమాతో ఉన్నాం. రాష్ట్రాభివృద్ధి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర ప్రజలు మరోసారి తీర్పు ఇవ్వనున్నారు.

విశ్వాసరాయి కళావతి,ఎమ్మెల్యే పాలకొండ

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



రాష్ట్రంలో గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్షగా నిలిచినట్లు ఎన్నికల సరళి చెబుతోంది. 2019లో వచ్చిన ఫలితాలే పునరావృతం కానున్నాయి. వలంటీర్ల వ్యవస్థ గాని, వృద్ధులకు నేరుగా ఇంటికి పింఛన్లు ఇవ్వాలన్నా, సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరాలన్నా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. -పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి

పారదర్శక పాలన జగన్‌తోనే సాధ్యం



రాష్ట్రంలో పారదర్శక పాలన వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని శనివారం ప్రకటించిన ఎగ్జిట్‌ పోల్స్‌ చెబుతున్నాయి. ఈనెల 4న విడుదల కానున్న ఫలితాలన్నీ వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉంటాయని మే 13న జరిగిన ఎన్నికల సరళి చెబుతోంది. ప్రజలకు మేలు చేశాం కాబట్టే మరోసారి గెలుపొందుతామనే ధీమా ఉంది. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మే 13నే ప్రజలు ఓటు ద్వారా తమ ఆమోదాన్ని తెలిపారు.

-పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యే కురుపాం

క్లీన్‌ స్వీప్‌ ఖాయం



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ క్లీన్‌ స్వీప్‌ చేయడం ఖాయం. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికయ్యేలా ప్రజాతీర్పు ఉందని శనివారం ప్రకటించిన ఎగ్జిట్‌ పోల్స్‌ స్పష్టం చేశాయి. ప్రజలకు మంచి చేశాం కాబట్టే కచ్చితంగా గెలుస్తామన్న నమ్మకంతో చెప్పగలుగుతున్నాం. -అలజంగి జోగారావు, ఎమ్మెల్యే పార్వతీపురం

క్లుప్తంగా

నర్సిపురంలో దొంగతనం



ఇంటిని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై దినకర్

పార్వతీపురం టౌన్: మండలంలోని నర్సిపురం ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. రూరల్ ఎస్సై దినకర్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి గంట లాజరు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి బయట వరండాలో పడుకున్నాడు. అర్ధరాత్రి చలి వేయడంతో దుప్పటి తెమ్మని భార్యకు చెప్పగా, ఆమె ఇంటిలోకి వెళ్లే సరికి బెడ్‌రూమ్‌లో ఉన్న వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులందరూ వచ్చారు. అయితే అప్పటికే దొంగలు పరారయ్యారు. సెల్ఫ్ ఆల్మరాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి పట్టీలు, రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 13,500 నగదు పోయినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య



మృతురాలు చోడిపల్లి ఉష (ఫైల్)

సాలూరు: యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కరాసవలస పంచాయతీ గడివలస గ్రామానికి చెందిన చోడిపల్లి ఉష (20) పట్టణంలోని ప్యారడైజ్ హోటల్‌లో పనిచేస్తోంది. అదే హోటల్‌లో పనిచేస్తున్న మరో ఇద్దరు యువతులతో కలిసి ఆమె పట్టణంలోని గొర్లెవీధిలో అద్దె ఇంటిలో ఉంటోంది. ఆదివారం సాయంత్రం అద్దె ఇంటిలోనే ఉష చున్నీతో ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



కర్రు శివప్రసాద్ (ఫైల్)



దేబార్కి శరత్‌కుమార్ (ఫైల్)



ప్రమాద స్థలంలో శివప్రసాద్, శరత్‌కుమార్ మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్సై కృష్ణమూర్తి

డెంకాడ: మండలంలోని బొడ్డవలస పెంట్రోల్ బంక్ సమీపంలో విజయనగరం – విశాఖ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతలవలస గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కర్రు శివప్రసాద్, దేబార్కి శరత్‌కుమార్ మంచి స్నేహితులు. ఇద్దరూ వ్యక్తిగత పనిమీద భీమునిపట్నం వెళ్లి అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై శనివారం అర్ధరాత్రి స్వగ్రామానికి బయలుదేరారు. సరిగ్గా ఒంటిగంట ప్రాంతంలో బొడ్డవలస పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు టైల్స్ పని చేస్తూ కుటుంబాలకు అండగా ఉంటున్నారు. శరత్‌కుమార్‌కు తల్లి, తమ్ముడు.. కర్రు శివప్రసాద్‌కు తల్లి, అక్క ఉన్నారు. చేతికి అందివచ్చిన కొడుకులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్సై కృష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

క్రీడాకారుల అడ్డా సిరిపురం...

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు
- సహకారం అందిస్తున్న గ్రామస్తులు

సంతకవిటి: మండలంలోని సిరిపురం క్రీడాకారుల అడ్డాగా నిలుస్తోంది. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి సంవత్సరం వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని అధిక సంఖ్యలో విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇక్కడ శిక్షణ పొందే విద్యార్థులకు పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. యూనిఫారాలతో పాటు ప్రతిరోజూ ఉడకబెట్టిన గుడ్డు, న్యూట్రిషియన్ బిస్కెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమకూరుస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని హెచ్ఎం వి.వెంకటరావు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులే అయినప్పటికీ పీడీలు కె.సన్నిబాబు, బుజ్జి పర్యవేక్షణలో అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, త్రో బాల్, యోగాలలో శిక్షణ తీసుకుంటూ.. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో రాణిస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ శిక్షణ పొందిన వారిలో సుమారు వంద మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో, పది మంది జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడలకు 19 మంది, వాలీబాల్‌కు ఒక అమ్మాయి, ఖోఖోకు ఒకరు, స్విమ్మింగ్‌కు ఒకరు ఎంపికయ్యారు.



2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు (ఫైల్)

పీడీల సహకారం మరువలేనిది...



పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాను. శిక్షణలో పీడీలు అందిస్తున్న సహాయ, సహకారాలు మరువలేం. ప్రతి సంవత్సరం వేసవి క్రీడా శిక్షణలో ఖోఖోలో మెలకువలు నేర్చుకుంటున్నాను. గత నవంబర్‌లో స్కూల్ గేమ్స్ అండర్ – 14 విభాగంలో చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో జరిగిన పోటీలలో పాలొన్నాను. మా జట్టు ద్వితీయ స్థానం సాధించింది.

– యలమంచిలి యోచన, ఖోఖో క్రీడాకారిణి

శిక్షణ ఎంతో ఉపయోగపడింది...



ఆరో తరగతి నుంచి ప్రతి ఏటా సిరిపురం హైస్కూల్‌లో జరుగుతున్న వేసవి క్రీడా విక్షణ శిబిరంలో పాల్గొని అథ్లెటిక్స్‌లో మెలకువలు నేర్చుకుంటున్నాను. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాను. ఏలూరు, గుంటూరు, తిరుపతి, శ్రీకాకుళం, ఏఎన్‌యూ, నరసరావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని 800 మీటర్ల రన్నింగ్‌లో పదిసార్లు మెడల్స్ సాధించాను. ఇటీవల జనవరిలో అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి 800 రన్నింగ్ పోటీల్లో పాల్గొన్నాను.

– ఎస్. సమీర, అథ్లెటిక్

శిక్షణ బాగుంది..



ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్నాను. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరం చాలా బాగుంది. అథ్లెటిక్స్ అంటే చాలా ఇష్టం. అథ్లెటిక్స్‌లో మెలకువలు నేర్చుకుంటున్నాను. అహ్మదాబాద్‌లో జరిగిన అండర్ – 19 జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొన్నాను

– బాలాంజలి, క్రీడాకారిణి

సహకారం మరువలేనిది



తల్లిదండ్రులు, హెచ్ఎం, దాతల సహకారం మరువలేనిది. గడిచిన ఏడు సంవత్సరాల నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాం. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణిస్తున్నారు. ఎంతోమంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం ఆనందంగా ఉంది.

– కె.సన్నిబాబు, పీడీ

పిడుగుపాటుకు పది గొర్రెల మృతి



పిడుగు పాటుతో మృతిచెందిన గొర్రెలు

వంగర: మండల పరిధి పట్టువర్ధనం గ్రామ సమీపంలో గొర్రెల మందపై పిడుగుపడడంతో పది గొర్రెలు మృతిచెందాయి. ఆదివారం రాత్రి భారీ ఉరుములతో కూడిన వర్షం కురవడంతో సమీప పంటపొలాల్లో గొర్రెల మంద పై పిడుగులు పడ్డాయి. దీంతో గ్రామానికి చెందిన చిన్ని గంగులు 10 గొర్రెలు మృతిచెందాయి. ఈ నష్టాన్ని గుర్తించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

చేపల వర్తకులపై కేసు నమోదు



కేసులు నమోదు చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 100 ఫీట్ రింగురోడ్డులో ఉన్న పలు దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలు అతిక్రమిస్తూ తూనికల రాళ్లతో వినియోగదారులను మోసగిస్తున్న ముగ్గురు చేపల వర్తకులపై కేసులు నమోదు చేశారు. గతంలో కూడా ఇదే వర్తకులపై కేసులు నమోదయినట్లు తెలిపారు. మరోసారి ఇటువంటి మోసాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని వర్తకులను హెచ్చరించారు. తూనికల్లో జరిగే మోసాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా మోసాలు గుర్తిస్తే తమ శాఖకు తెలియజేయాలని ఎస్సై ఎం.దామోదరనాయుడు కోరారు.

శ్రీరామ చక్రధర్‌కు సత్కారం



తవాష్మీ బృంద సభ్యులను సత్కరిస్తున్న ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్

విజయనగరం రూరల్: రామాయణంపై 10 ఏళ్లుగా పరిశోధనలు చేస్తున్న తవాస్మి, మనస్వి, తపస్వి పుస్తక రచయిత శ్రీరామ చక్రధర్‌ను ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ ఆదివారం ఘనంగా సత్కరించారు. హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా రామనారాయణంలో తవాస్మి బృదం ఆధ్వర్యంలో రామాయణం ఆవశ్యకతను పిల్లలకు, పెద్దలకు వివరిస్తూ 6 రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. తవాస్మి బృదం సేవలను గుర్తిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామా చక్రధర్ మాట్లాడుతూ.. రామాయణం మన ఇతిహాసం(చరిత్ర), మనిషికి మానవత్వాన్ని పరిచయం చేసి వారిని వీరులుగా, ధీరులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడే ఉత్తమ గ్రంథమన్నారు. రామాయనంలోని అంశాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్లు రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్, తదితరులు

విజయనగరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని, చేతివృత్తుల ద్వారా స్వయం ఉపాధి పొందాలని ఎన్‌సీఎస్ గ్రూపు అధినేత నారాయణం శ్రీనివాస్ అన్నారు. ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బలిజవీధి సంఘం భవనం వద్ద ఆదివారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఈ కుట్టు శిక్షణ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని నానాజీ మాట్లాడుతూ.. ప్రస్తుతం 54 మంది మహిళలకు శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కస్పా ఆర్యవైశ్య సంఘం నూతన భవన నిర్మాణానికి రూ.10 లక్షలను సంఘం తరపున విరాళంగా అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి పేర్ల సీతారామయ్య శెట్టి, కోశాధికారి కందుల సంతోష్, వెత్సా శ్రీనివాసరావు, పలివెల శ్రీనివాస్, అక్షింతల సతీష్, శిరం గవరరాజు, కంచెర్ల ప్రకాష్, గుంపిన నారాయణరావు, మండవిల్లి వెంకటరాజు, జనార్దనరావు, రత్నారావు, కుట్టు శిక్షణ శిక్షకురాలు శారద, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

- ఆర్‌ఓబీ రెయిలింగ్‌ను ఢీకొన్న బొలేరో



ప్రమాదంలో క్షతగాత్రుడు చంటి, రైయిలింగ్ పైకి దూసుకెళ్లిన బొలేరో

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి రైల్వే ఓవర్ బ్రిడ్జిపై (ఆర్‌ఓబీ) శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనచోదకుడు గాయాలపాలై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎల్.దామోధరరావు తెలిపిన వివరాల మేరకు.. చీపురుపల్లి వైపు నుంచి విజయనగరం వైపు రాత్రి 11:30 గంటల ప్రాంతంలో బొలేరో వాహనం వెళ్తుండగా.. అదే సమయంలో విజయనగరం వైపు నుంచి చీపురుపల్లి వైపు జి.సిగడాం మండలం గెడ్డ కంచరాం గ్రామానికి చెందిన చంటి అనే వ్యక్తి బైక్‌పై ఎదురుగా వస్తున్నాడు. ఈ సమయంలో బొలేరో వాహనం నడుపుతున్న డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా.. బొలేరో వాహనం అదుపు తప్పి ఆర్‌ఓబీ రెయిలింగ్‌పైకి దూసుకెళ్లింది. రెయిలింగ్ పిల్లర్లు కూలి ఆర్‌ఓబీ కింద నున్న ప్రధాన రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో తారురోడ్డుపై ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇదిలా ఉంటే బొలేరే వాహనం డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడతో ద్విచక్ర వాహనదారుడు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో గాయపడిన వాహనదారుడ్ని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఎస్సై దామోధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులే కీలకం..



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ

- ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ

విజయనగరం అర్బన్: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకమని, ఆ దిశగా ప్రభుత్వాలు వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ అన్నారు. ఆదివారం స్థానిక పీఎస్ఆర్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యరంగ అభివృద్ధిలో ఉపాధ్యాయులే ప్రధానపాత్ర పోషించాలని సూచించారు. ఏకీకృత సర్వీస్ సాధన కోసం ఆపస్ కృషి చేస్తోందని చెప్పారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వీవీజే సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి ఈ.రాముునాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రమణ, కె.సంతోషలక్ష్మి, కోశాధికారి ఏజీ తాతారావు, మహిళా కన్వీనర్ జి.పద్మలత, ముగడ రమణ, కెల్ల భాస్కరరావు, కె.సాయికుమార్, కె.శివప్రసాద్, ఎస్.నారాయణరావు, వీవీ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షునిపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు టి.వి.దుర్గారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఓ మహిళను వెంబడిస్తూ వేధించినందుకు అతం మోహన్ అనే అతన్ని పిలిచి మందలించారని, అందుకు ప్రతీకారంగా సూరిబాబుపై అతం మోహన్, అతం ప్రసాద్, మరో వ్యక్తితో కలిసి మారణాయుధాలతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిని సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పోలీసులు స్పందించి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు.

సీఓపీడీ ప్రాణాంతకం..

- పెరుగుతున్న కేసులు
- దగ్గు , ఆయాసం ఉన్న వారిలోఅధికం
- ప్రతి 10 మందిలో 8 మందికి నిర్ధారణ
- జిల్లాలో 40 శాతం మందికి పైగా సీఓపీడీ వ్యాధిగ్రస్తులు
- ఏటా 15 వేల వరకు కేసుల నమోదు
- మూడో ప్రాణంతక వ్యాధిగా పరిగణింపు

విజయనగరం ఫోర్ట్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే క్షయ, కుష్టు, హెచ్ఐవీ వ్యాధులను అదుపు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొచ్చి ప్రాణాంతకంగా మారుతున్నాయి. మూడేళ్ల కిందట కరోనా విలయతాండం వచేసి ప్రజలను వణికించింది. తాజాగా సీఓపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) రోజు రోజుకూ విస్తరించి, ప్రమాదకరంగా మారుతోంది. జిల్లాలో వేలాది మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. అదేవిధంగా రోజు రోజుకూ కేసుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయం. ప్రపంచంలోనే మూడో ప్రాణంతక వ్యాధిగా దీన్ని పరిగణిస్తున్నారు. జిల్లాలో ఏటా 15 వేల వరకు సీఓపీడీ కేసులు నమోదవుతున్నాయి.

పొగ తాగడం, పీల్చడం వల్లే వ్యాప్తి..

పొగ తాగడం వల్ల , పొగ తాగే వ్యక్తి పక్కన ఉండడం వల్ల సీఓపీడీ వ్యాధి వ్యాపిస్తుంది. ముఖ్యంగా అడ్డపొగ తాగే వారిలో ఎక్కువగా ఈ వ్యాధి కనిపిస్తుంది. గోధుమ రంగులో కఫం పడడం, ఆయాసం, దగ్గు ఈ వ్యాధి లక్షణాలు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడంలో జాప్యం జరిగితే గుండెపై ప్రభావం పడి ప్రాణాల మీదకు వస్తుంది. ఒకసారి వ్యాధి సోకితే జీవితాంతం చికిత్స తీసుకోవాల్సిందే. సీఓపీడీ సోకిన వారు సకాలంలో వైద్యుడ్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.



పొగ తాగుతున్న వ్యక్తి

జిల్లాలో 40 శాతానికి పైగా వ్యాప్తి..

సీఓపీడీ వ్యాధి జిల్లాలో అధికంగా ఉంది. 40 శాతానికి పైగా ప్రజలు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంతవరకు పలమనాలజీ సేవలు అందుబాటులో లేక పోవడం వల్ల ఈ వ్యాధి గుర్తింపు పెద్దగా జరగలేదు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రస్తుతం పలమనాలజీ సేవలు అందుబాటులోకి రావడంతో వ్యాధిగ్రస్తుల గుర్తింపు జరుగుతోంది. దగ్గు, ఆయాసంతో వచ్చిన ప్రతి 10 మందిలో 8 మందికి సీఓపీడీ నిర్ధారణ అవుతోంది.



సీఓపీడీ రోగిని పరిక్షిస్తున్న వైద్యుడు

పొగతాగడం మానేయాలి..



సీఓపీడీ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే పొగ తాగడం పూర్తిగా మానేయాలి. అదేవిధంగా పొగతాగే వారి పక్కన కూడా ఉండకూడదు. సకాలంలో వైద్యం చేయించుకోవాలి. సీఓపీడీ ప్రాణంతకమైన వ్యాధి. జిల్లాలో అధికంగా కేసులు వస్తున్నాయి.

– డాక్టర్ బొత్స సంతోష్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

V. PRIME విజయనగరంకి 28 కి.మీ॥ దూరంలో గర్ల మండలం, గరికివలసనందు అన్ని వసతులతో V. PRIME SANDAL WOOD వెంచర్‌నందు 100 గజాల్లో 10 శ్రీగంధ మొక్కలతో ప్లాట్స్ అమ్మకమునకు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 94419 38177 [V- 2574]

LAND FOR SALE

విజయనగరం జిల్లా జామి మండలం, జి.సింగవరం గ్రామంలో 1.35 ఎకరాలు సపోటా తోట అమ్మకానికి కలదు. సంప్ర : 90638 90162, 94406 60987, 81062 34196 [V- 36463]

FOR SALE

1Ac Mango Garden for Sale at Gurla, 100 Mts from Highway, Beside BBR Layout. Ph: 9052249333 [WB-7704]

BUSINESS OFFER

మల్టీ నేషనల్ కంపెనీకి ఆథరైజ్డ్ డీలర్స్ కావలెను. డిపాజిట్ లేదు. ఆసక్తి ఉన్నవారు వివరాలకు సంప్రదించండి ✆ 73820 43258 [B-3561]

కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9253560455. [T-1262254]

WANTED

ADMS e BIKES Wanted team leaders, Salary 20,000/- + incentive. work from home town, contact: 8897221102, 8247527141 [S-1192085]

విజయనగరం కోట వద్ద, లైన్స్ క్లబ్ ఎదురుగా గల లైఫ్‌లైన్ మెడికల్ హబ్‌లో పనిచేయుటకు సీనియర్ ఫార్మసిస్ట్ మరియు మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. సం.ప్ర॥ 8712218499 [S- 1235982]

Work From Home : టీమ్ లీడర్స్, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు, గృహిణులు, నిరుద్యోగులు, ఇన్సూరెన్స్ ఏజెంట్లు కావలెను. ఆకర్షణీయమైన జీతం. ఫోన్ : 94906 92882 [V- 0127]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185096]

సెక్యూరిటీ గార్డులు, హౌస్‌కీపింగ్ బాయ్స్ కావలెను. జీతం: 12-20 వేలు, రూమ్, భోజనం. అర్హత: 10th, బయోడేటా, ఫోటో వాట్సాప్ చేయండి. RSR, Vizag, సెల్: 73065 82829 [V- 1566]

కుక్స్ కావలెను: విశాఖపట్నం శంకరమఠం దగ్గర గల లేడీస్ హాస్టల్‌లో పనిచేయుటకు వంట మాస్టర్ (లేడీస్/జంట్స్) కావలెను. జీతం: 8 నుండి 12వేలు వరకు భోజనం, వసతి ఫ్రీ. ఫోన్: 93934 54558. [V- 2575]

క్యాంపస్ ఇన్‌చార్జీలు, క్లాసు ఇన్‌చార్జీలు, హాస్టల్ ఇన్‌చార్జీలు, వార్డెన్స్‌గా పని చేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. జీతము: 10,000/- నుండి 20,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనం, వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ ఆపైన, వయస్సు: 21+, పనిచేయు స్థలం: మాస్టర్ మైండ్స్, గుంటూరు. ఫోన్ నెంబర్: 9248733372 [G-5396]

కన్సల్టెన్సీకాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోడానికి స్త్రీ/పురుషులు, ఆయా, నర్సులు,వంటచేయవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15000- 40000, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. ఫోన్: 7995365999 [HA-182]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.